సాక్షి
నంద్యాల
ఆదివారం । 15 । అక్టోబర్ । 2023





## అహోబిలంలో ప్రత్యేక పూజలు

ఆళ్లగడ్డ: మహాలయ అమావాస్యను పురస్కరించుకుని అహోబిలంలో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాదవరదస్వాములతోపాటు అండాల్ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## క్షేత్రపాలకుడికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలక్షేత్ర పాలకుడు బయలు వీరభద్ర స్వామికి శనివారం అమావాస్య సందర్భంగా పూజలు నిర్వహించారు. లోక క్షేమాన్ని కాంక్షిస్తూ అర్చకులు సంకల్పాన్ని పఠించారు.



## ప్రభుత్వ సహకారం భేష్

చేనేత పరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వ సహకారం, ప్రోత్సాహం చాలా బాగుందని కేంద్ర ప్రభుత్వం తరఫున జిల్లాకు వచ్చిన ఇన్వెస్ట్ ఇండియా ప్రతినిధి హరిప్రీత్‌సింగ్ కితాబిచ్చారు. 10లో▸



## న్యూస్‌రీల్

### యూజీ నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీకి దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని పీఎస్సీ కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యూజీ నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీతో పాటు రీసెర్చ్ చేసేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ 2023లో డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. తమ కళాశాల విద్యార్థులు మాత్రమే కాకుండా ఇతర కళాశాలలో డిగ్రీ చేసి పూర్తి చేసిన వారు కూడా అర్హులేనన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు నంద్యాల పీఎస్సీ కేవీఎస్సీ కళాశాలలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 9490602116, 9440220902 సంప్రదించాలన్నారు.

### సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 24వ తేదీ వరకు ప్రభుత్వం దసరా సెలవులను ప్రకటించిందని, సెలవు రోజుల్లో తరగతులు నిర్వహించే విద్యా సంస్థలపై చర్యలు తప్పవని డీఈఓ సుధాకర్ రెడ్డి హెచ్చరించారు. శనివారం ఆయన మాట్లాడుతూ సిలబస్ పూర్తి కాలేదనే నెపంతో స్టాఫ్ మీటింగ్, రిజిస్టర్ల వర్క్ పేరుతో నిబంధనలకు వ్యతిరేకంగా తరగతులు నిర్వహించే విద్యా సంస్థలపై 1902, 1098 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు.

### నంద్యాలకు చేరిన మహానందీశ్వర దంపతులు



మేళతాళాల మధ్య నంద్యాలకు బయలుదేరిన స్వామి, అమ్మవార్లు

నంద్యాల(వ్యవసాయం)/మహానంది: నంద్యాల పట్టణంలోని కోటా వీధిలో వెలసిన బ్రహ్మనందీశ్వరస్వామి దసర శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనేందుకు మహానంది నుంచి గంగా, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి వార్లు శనివారం సాయంత్రం విడిది మండపానికి చేరుకున్నారు. ముందుగా మహానంది ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, అర్చకులు స్వామి, అమ్మవార్లను అలంకరించి మేళతాళాల మధ్య బయలుదేరారు. నంద్యాలకు చేరుకోగానే బ్రహ్మనందీశ్వరస్వామి ఆలయ ఈఓ లక్ష్మీనారాయణ దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు స్వామి అమ్మవార్లకు పూర్ణకుంభంతో, మేళతాళాలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారికి మంగళ హారతులు నిర్వహించారు. 9 రోజుల పాటు బ్రహ్మనందీశ్వరస్వామి దేవస్థానంలో పూజలుందుకుని 11వ రోజు తిరిగి మహానందికి బయలుదేరుతారని ఈఓలు తెలిపారు.

### శ్రీశైలంలో 77 టీఎంసీల నీటి నిల్వలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయంలో రోజురోజుకు నీటి నిల్వలు తగ్గుతున్నాయి. ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి కొంతకాలంగా వరద నీటి ప్రవాహం నిలిచిపోయింది. విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో ఉత్పాదన కొనసాగుతుండడం, దిగువ ప్రాజెక్టులకు నీటిని విడుదల చేస్తుండడంతో జలాశయంలో నీటి నిల్వలు క్రమేపీ తగ్గుతున్నాయి. శనివారం సాయంత్రం సమయానికి 77.1732 టీఎంసీల నిరు నిల్వగా ఉంది. డ్యామ్‌నీటిమట్టం 848.70 అడుగులకు చేరుకుంది. శుక్రవారం నుంచి శనివారం వరకు జలాశయం నుంచి దిగువ ప్రాంతాలకు 10,438 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో 2.415 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి, 4,852 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు వదిలారు. బ్యాక్‌వాటర్ నుంచి మల్యాల ఎత్తిపోతలకు 337 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 1,500 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజలస్రవంతి 1,560 క్యూసెక్కుల కల్వకుర్తి ఎత్తిపోతలకు 1,967 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.



# దసరాకు రైట్ రైట్!

- పండుగకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు
- హైదరాబాద్‌కు అత్యధికంగా 61 సర్వీసులు
- సాధారణ చార్జీలతోనే పండగ ప్రయాణం
- రానుపోను ఒకేసారి టికెట్ బుక్ చేసుకుంటే 10 శాతం రాయితీ

సాక్షి, నంద్యాల: దసరా పండగ సమీపిస్తున్న తరుణంలో ప్రయాణికుల రద్దీ మేరకు బస్సు సర్వీసులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు ప్రణాళిక రూపొందించారు. పండగల్లో దసరా పెద్ద పండగ కావడంతో వివిధ ప్రాంతాల్లో పని చేసే ఉద్యోగులు, వ్యాపారులు, ఉన్నత చదువులు చదివే విద్యార్థులు తప్పనిసరిగా సొంతూర్లకు చేరుకుంటారు. ఈ క్రమంలో ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ యంత్రాంగం బస్సులు నడిపేందుకు సన్నద్ధమవుతోంది. నంద్యాల రీజియన్ పరిధిలో గతేడాది దసరా నేపథ్యంలో హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ తదితర నగరాలకు 66 సర్వీసులను నడపగా.. ఈ ఏడాది నాలుగింటిని పెంచి 70 సర్వీసులతో ప్రణాళిక రూపొందించారు. ఇందులో 61 సర్వీసులను హైదరాబాద్‌కే కేటాయించారు. ఆళ్లగడ్డ నుంచి 9, ఆత్మకూరు 8, బనగానపల్లె 7, డోన్ 6, కోవెలకుంట్ల 13, నంద్యాల నుంచి 18 సర్వీసులను కేటాయించారు. అలాగే బెంగళూరుకు ఆళ్లగడ్డ నుంచి 2, నందికొట్కూరు 2, నంద్యాల నుంచి 3... విజయవాడకు నంద్యాల నుంచి 2 ప్రత్యేక సర్వీసులను నడపనున్నారు. ఈ నెల 23వ తేదీన పండగ జరుపుకోనున్న నేపథ్యంలో హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో ప్రయాణికులు సొంత గూటికి చేరుకోనున్నారు. ఇప్పటికే 14వ తేదీ నుంచి పాఠశాలలకు సెలవులు ఇచ్చారు.



బస్సుల కోసం వేచిచూస్తున్న ప్రయాణికులు

ఈ నేపథ్యంలో పిల్లలతో కలిసి తల్లిదండ్రులు సొంత ఊళ్లకు చేరుకోనున్నారు. ఈనెల 19వ తేదీ నుంచి అధిక సంఖ్యలో సర్వీసులు నడపనున్నట్లు అధికారులు తెలిపారు.

### ప్రయాణికులపై భారం పడకుండా..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రత్యేక సర్వీసుల పేరుతో టికెట్‌పై 50 శాతం అధిక చార్జీలు వసూలు చేసేవారు. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రత్యేక సర్వీసుల్లోనూ సాధారణ చార్జీలే వసూలు చేస్తున్నారు. ప్రయాణికులు ఆర్టీసీ డిపోల్లోని రిజర్వేషన్ కౌంటర్లలో, ఏపీఎస్ఆర్టీసీ వెబ్‌సైట్, అభి బస్, రెడ్ బస్ తదితర యాప్స్‌లోనూ టికెట్లు రిజర్వేషన్ చేసుకోవచ్చు. అలాగే ఒకేసారి రానుపోను టికెట్ బుక్ చేసుకుంటే పది శాతం చొప్పున రాయితీ లభిస్తుంది.

### గతేడాది అరకోటి ఆదాయం

గతేడాది దసరా పండుగకు జిల్లా వ్యాప్తంగా ఏడు డిపోల నుంచి 66 సర్వీసులను ఆర్టీసీ అధికారులు నడిపారు. 23 వేల మంది ప్రయాణికులు ఆర్టీసీలో ప్రయాణించారు. మొత్తం 1.46 లక్షల కిలోమీటర్ల మేర సర్వీసులు నడిపారు. సుమారు రూ.49.06 లక్షల ఆదాయం వచ్చింది. కిలోమీటర్‌కు రూ. 33.57 వచ్చింది. ఆక్యుపెన్సీ రేషియో 61గా నమోదైంది. ఈ ఏడాది ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

> ప్రత్యేక సర్వీసులకు రిజర్వేషన్ సదుపాయం
>
> ప్రత్యేక సర్వీసులకు సంబంధించి రిజర్వేషన్ సదుపాయం ఇప్పటికే అందుబాటులో ఉంది. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పండుగల సమయాల్లోనూ సాధారణ చార్జీలే వసూలు చేస్తున్నాం. రానుపోను టికెట్ బుక్ చేసుకుంటే 10 శాతం రాయితీ కూడా లభిస్తుంది. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం. ప్రయాణికుల రద్దీని బట్టి సర్వీసులను పెంచే ఆలోచన కూడా చేస్తాం.
>
> – శ్రీనివాస్, ప్రజా రవాణా అధికారి, నంద్యాల

## 19న ఎమ్మిగనూరుకు సీఎం వైఎస్ జగన్



ఎమ్మిగనూరుటౌన్: జగనన్న చేదోడు పథకం కింద నాలుగో విడత లబ్ధిదారులకు ఆర్థిక సహాయాన్ని అందజేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 19న ఎమ్మిగనూరు పట్టణానికి రానున్నట్లు అధికారులకు సమాచారం అందింది. దీంతో శనివారం సాయంత్రం జిల్లా జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ ఎమ్మిగనూరు పట్టణానికి వచ్చారు. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డితో కలసి ఏర్పాట్లపై చర్చించారు. హెలిపాడ్ ఏర్పాటు కోసం పట్టణంలోని వెంకటాపురం కాలనీ వద్ద స్పిన్నింగ్ మిల్లు సమీపంలోని మైదానాన్ని పరిశీలించారు. అనంతరం పట్టణంలోని వైడబ్ల్యూసీఎస్ మైదానంలో ఏర్పాటు చేయనున్న సీఎం సభా స్థలిని పరిశీలించారు. బారికేడ్ల ఏర్పాటు, వీఐపీ గ్యాలరీ, పార్కింగ్ తదితర అంశాలపై అధికారులకు జేసీ సూచనలిచ్చారు. శనివారం సాయంత్రం స్థానిక మున్సిపల్ సమావేశమందిరంలో సమావేశం నిర్వహించారు. జగనన్న తోడు పథకం లబ్ధిదారులను సభాస్థలికి తరలించేందుకు బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను జేసీ ఆదేశించారు. ప్రజల నుంచి వినతులు తీసుకునేందుకు గ్యాలరీ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కెఎస్ రఘు, విద్యుత్, ఆర్ అండ్‌బీ ఎస్ఈలు ఉమాపతి, నాగరాజు, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారిణి విజయలక్ష్మి, డీఎస్పీ సీతారామయ్య, సీఐ మధుసుదన్‌రావు, తహసీల్దార్ ఆంజినేయులు, మున్సిపల్ డీఈ మనోహర్ రెడ్డి, ఆర్టీసీ డీఎం అమర్నాథ్, ట్రాన్స్‌కో డీఈ రాఘవేంద్ర, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటింగ్ యంత్రాల పరిశీలనకు ఏర్పాట్లు చేయండి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: ఈనెల 16 నుంచి ప్రారంభమయ్యే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ప్రథమ స్థాయి పరిశీలన(ఎఫ్ఎల్‌సీ)కు ఏర్పాట్లు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ డీఆర్ఓ పుల్లయ్య, ఆర్డీఓ శ్రీనివాసులును ఆదేశించారు. టెక్కె మార్కెట్ యార్డు గోడౌన్‌లో భద్రపరచిన ఈవీఎంలను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో శనివారం జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల 16 నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ప్రథమ స్థాయి పరిశీలన (ఎఫ్ఎల్‌సీ) చేపడతామన్నారు. ఈవీఎంలు భద్రపరిచిన గోడౌన్‌లో పరిశీలనకు అవసరమైన టేబుళ్లు, కుర్చీలు, టీవీ, లైటింగ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఫ్లెక్సీ బ్యానర్ ఏర్పాటు చేయడంతో పాటు బెల్ ఇంజినీర్లకు అవసరమైన కంప్యూటర్లు, ప్రింటర్లు, ఇతర స్టేషనరీ సామగ్రి కొరత లేకుండా చూసుకోవాలన్నారు. బిల్డింగ్ చుట్టూరా బారికేడింగ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. గుర్తింపు కార్డులు మంజూరు చేసిన వ్యక్తులనే లోపలికి అనుమతించాలన్నారు. పరిశీలన గది బయట సెల్‌ఫోన్లు డిపాజిట్ చేసేందుకు కౌంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. మెటల్ డిటెక్టర్‌ను ఏర్పాటు చేసి ప్రతి వ్యక్తిని చెక్ చేసి లోపలికి అనుమతించేలా చర్యలు తీసుకోవాలని డీఎస్పీ మహేశ్వరరెడ్డికి సూచించారు. వెబ్ కాస్టింగ్ ద్వారా ఓటింగ్ యంత్రాల పరిశీలన పర్యవేక్షించేందుకు సీసీ నిఘా కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. 12 మంది బెల్ ఇంజినీర్లు, 50 మంది మున్సిపల్ సచివాలయ సిబ్బంది, 40 మంది రెవెన్యూ సిబ్బందిని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ప్రథమ స్థాయి పరిశీలన(ఎఫ్ఎల్‌సీ)కు వినియోగిస్తున్నామన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 7 గంటల వరకు జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఓటింగ్ యంత్రాల పరిశీలన జరుగుతుందన్నారు. రాజకీయ పార్టీ ప్రతినిధులకు జారీ చేసిన గుర్తింపు కార్డుదారులను మాత్రమే లోపలికి అనుమతిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ తరఫున అనిల్ అమృతరాజు, సీపీఎం ప్రతినిధి పూల నరసింహులు, సీపీఐ తరఫున రంగనాయుడు, కాంగ్రెస్ పార్టీ తరఫున సయ్యద్ రియాజ్, తెలుగుదేశం పార్టీ తరఫున శివరామిరెడ్డి, నంద్యాల తహసీల్దార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఈవీఎంల గురించి కలెక్టర్‌కు వివరిస్తున్న డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి

## ప్రశాంతంగా ఎస్ఐ మెయిన్స్ రాత పరీక్ష

- 8,521 మందికి గాను 8,396 మంది అభ్యర్థులు హాజరు
- పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన డీఐజీ, ఎస్పీలు

కర్నూలు: రాయలసీమ జోన్ పరిధిలో ఎస్ఐ మెయిన్స్ రాత పరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసింది. 8,521 మంది అభ్యర్థులకు గాను 8,396 మంది అభ్యర్థులు హాజరయ్యారు. రెండు రోజుల పాటు జరగనున్న ఎస్ఐ మెయిన్స్ ఫైనల్ రాత పరీక్షలకు కర్నూలులో 14 కేంద్రాలు ఏర్పాటు చేశారు. కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్, కర్నూలు, అనంతపురం జిల్లాల ఎస్పీలు కృష్ణకాంత్, కె.కె.అన్బురాజన్, సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ సంయుక్తంగా 14 పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు. మొదటి రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పేపర్-1, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పేపర్-2 పరీక్ష జరిగింది. ఆయా రూట్లలో స్ట్రాంగ్ రూమ్‌లు పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తుతో అన్ని రకాల భద్రత చర్యలు చేపట్టారు. హాజరైన వారిలో పురుష అభ్యర్థులు 7,537 మంది, మహిళా అభ్యర్థులు 859 ఉన్నారు. 107 మంది పురుష అభ్యర్థులు, 18 మంది మహిళా అభ్యర్థులు కలిపి మొత్తం 125 మంది గైర్హాజరయ్యారు. ఆయా పరీక్షా కేంద్రాల వద్ద నిర్ణీత సమయం కంటే గంట ముందు నుంచే విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తూ అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. మొబైల్స్, ఇతర ఎలక్ట్రానిక్ డిజిటల్ పరికరాలను అనుమతించలేదు. పరీక్ష కేంద్రాల చుట్టూ వంద మీటర్లలో ఉన్న జిరాక్స్ సెంటర్లను పోలీసులు మూసివేయించారు. హాల్‌టిక్కెట్‌తో పాటు ప్రభుత్వ గుర్తింపు పొందిన ఆధార్ కార్డు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ వంటి వాటిలో ఏదో ఒకటి ఉన్న వారిని మాత్రమే పరీక్ష రాసేందుకు అనుమతించారు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వాచ్‌లు వంటి వాటిని కూడా ఆయా కేంద్రాల గేట్ల వద్దనే సీజ్ చేసి అభ్యర్థులను లోపలికి పంపారు. మాల్ ప్రాక్టీస్ జరగకుండా డీఎస్పీ స్థాయి అధికారులు పరీక్షా కేంద్రాల వద్ద పర్యవేక్షించారు.





పరీక్ష కేంద్రాల్లో తనిఖీ చేస్తున్న కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్‌కుమార్, ఎస్పీ కృష్ణకాంత్

> **నేడు కూడా ఎస్ఐ పరీక్ష..**
>
> రెండు రోజుల పాటు జరిగే ఎస్ఐ రాత పరీక్షల్లో మొత్తం నాలుగు పేపర్లు ఉంటాయి. రెండు పేపర్లు డిస్క్రిప్టివ్ టైప్, మరో రెండు పేపర్లు ఆబ్జెక్టివ్ టైప్ ఉంటాయి. రెండో రోజు ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పేపర్-3, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పేపర్-4 పరీక్ష జరగనుంది.

# ఉత్సవాలకు వేళాయె!

### శ్రీశైలంలో నేటి నుంచి దేవీశరన్నవ రాత్రోత్సవాలు

- యాగశాల ప్రవేశంతో ఉత్సవాలకు అంకురార్పణ
- మొదటిరోజు శైలపుత్రి అలంకారంలో శ్రీశైల భ్రామరీ భక్తులకు దర్శనం
- భృంగివాహనంపై విహరించనున్న స్వామిఅమ్మవార్లు



విద్యుత్ దీపాలంకరణలో స్వామి, అమ్మవారు

శ్రీశైలంటెంపుల్: దసరా మహోత్సవాలకు శ్రీశైల క్షేత్రం ముస్తాబైంది. నేటి నుంచి ఈ నెల 24వ తేదీ వరకు భ్రమరాంబాదేవి శరన్నవరాత్రోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. సంప్రదాయాన్ని అనుసరించి శాస్త్రోక్తంగా నిర్వహించే ఈ ఉత్సవాలలో అమ్మవారికి నవదుర్గ అలంకారాలు, ప్రత్యేక నవావరణపూజలు, స్వామిఅమ్మవార్లకు వాహనసేవలు, చండీయాగం, రుద్రయాగం జరుగనున్నాయి.



దసరా ఉత్సవాలకు ఏర్పాటు చేసిన స్వాగత తోరణం



విద్యుత్‌దీప కాంతులతో శ్రీశైలాలయం

### నేడు ఉత్సవాలకు అంకుర్పాణ

దసరా మహోత్సవాలకు నాందిగా ఆదివారం ఉదయం 9 గంటలకు అమ్మవారి ఆలయ మండపంలో యాగశాల ప్రవేశం చేసి, గణపతి పూజ, స్వస్తిపుణ్యాహవచనం, దీక్షాసంకల్పం, కంకణపూజ, ఋత్విగ్వరణం, కంకణ పూజ, కంకణధారణ జరిపిస్తారు. అఖండస్థాపన, వాస్తు పూజ, వాస్తు హోమం, నవగ్రహ మండపారాధన, చండీకలశ స్థాపనం, చతుర్వేద పారాయణాలు, విశేష కుంకుమార్చనలు, గణపతి పంచాక్షరీ, కుంకుమార్చనలు, కుమారి పూజలు జరిపిస్తారు. 9.30 గంటలకు స్వామివారిని యాగశాల ప్రవేశం చేసి వేదస్వస్తి, శివసంకల్పం, గణపతిపూజ, అఖండ దీపాస్థాపన, వాస్తు పూజ, మండపారాధనలు, రుద్రకలశ స్థాపన, స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మధ్యాహ్నకాలార్చనలు, మహానివేదనలు జరిపిస్తారు. సాయంత్రం అంకురార్పణ, అగ్నిప్రతిష్టాపన, రుద్రహోమం, అమ్మవారికి నవావరణార్చన, కుంకుమార్చనలు జరిపిస్తారు.

### దసరా మహోత్సవాల్లో నేడు

దసరా మహోత్సవాల్లో భాగంగా మొదటి రోజు శ్రీశైల భ్రమరాంబాదేవి శైలపుత్రి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. అలాగే స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను భృంగివాహనంలో అధిష్టించి ప్రత్యేక పూజల అనంతరం గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

● మరో ఇద్దరికి గాయాలు



మృతి చెందిన శ్రీనివాసులు

**కొలిమిగుండ్ల:** నాగిశెట్టిపల్లె–హనుమంతుగుండం గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సంజామల మండలానికి చెందిన నీలి శ్రీనివాసులు(51) మృతి చెందాడు. అదే మండలానికి చెందిన మరో ఇద్దరు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. పేరుసోములకు చెందిన నజీర్ కొలిమిగుండ్ల మండలం బెలుం సమీపంలోని నాపరాతి గనుల్లోంచి రాళ్లను ప్రొద్దుటూరుకు చేర్చేందుకు లోడింగ్, అన్‌లోడింగ్ కోసం గిద్దలూరుకు చెందిన శ్రీనివాసులు, రామభద్రునిపల్లెకు చెందిన గోపాల్‌ను మాట్లాడుకున్నాడు. గనిలో రాళ్లను ట్రాక్టర్‌లో లోడ్ చేసుకుని బయలు దేరారు. మార్గమధ్యలో నాగిశెట్టిపల్లె దాటగానే బళ్లారి నుంచి జమ్మలమడుగు వైపు వెళ్తున్న లారీ అతి వేగంగా ట్రాక్టర్ వెనుక భాగాన ఢీకొంది. ట్రాక్టర్ బోల్తా పడటంతో నాపరాళ్లు చెల్లాచెదురుగా పడ్డాయి. ఇంజిన్‌పై కూర్చున్న శ్రీనివాసులు తీవ్రంగా గాయపడగా డ్రైవర్ నజీర్, గోపాల్ స్వల్పగాయాలతో బయట పడ్డారు. ముగ్గురిని చికిత్స నిమిత్తం జమ్మలమడుగు ఆసుపత్రికి తరలిచంగా కోలుకోలేక శ్రీనివాసులు మృతి చెందాడు. ప్రమాద విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రమేష్‌రెడ్డి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. రోడ్డుపై పడిన నాప రాళ్లను పక్కకు తొలగించి వాహన చోదకులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు.

# చేనేతకు ప్రభుత్వ సహకారం భేష్

● ఇన్వెస్ట్ ఇండియా ప్రతినిధి హరిప్రీత్‌సింగ్



మగ్గంపై నేసిన పట్టుచీరను పరిశీలిస్తున్న హరిప్రీత్‌సింగ్

**కర్నూలు(అగ్రికల్చర్)/ఎమ్మిగనూరుటౌన్/కోడుమూరు రూరల్:** చేనేత పరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వ సహకారం, ప్రోత్సాహం చాలా బాగుందని కేంద్ర ప్రభుత్వం తరపున జిల్లాకు వచ్చిన ఇన్వెస్ట్ ఇండియా ప్రతినిధి హరిప్రీత్‌సింగ్ అన్నారు. జిల్లాలో ఉత్పత్తి అవుతున్న చేనేత పట్టు చీరలకు జాతీయ స్థాయి అవార్డు పొందేందుకు అన్ని అర్హతలు ఉన్నాయని పేర్కొన్నారు. శుక్రవారం కర్నూలుకు వచ్చిన ఆయన శనివారం కోడుమూరు, ఎమ్మిగనూరుల్లో ఒక జిల్లా, ఒక ఉత్పత్తి కింద చేనేత పట్టు చీరల తయారీ పరిశీలించారు. ముందుగా ఆయన కర్నూలులో చేనేత, జౌళి శాఖ అధికారులతో సమావేశమై పట్టుచీరల తయారీ, మార్కెటింగ్, ప్రభుత్వ ప్రోత్సాహం తదితర వాటిపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన కోడుమూరులో చేనేత పట్టుచీరల తయారీని పరిశీలించారు. చేనేత కార్మికులతో ముఖాముఖి మాట్లాడారు. చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ నేతన్న నేస్తం కింద ఏడాదికి రూ.24 వేలు అందచేస్తోందని లబ్ధిదారులు వివరించారు. అనంతరం ఎమ్మిగనూరులో చేనేత సహకార సంఘం ఉత్పత్తి చేసిన వస్త్రాలను పరిశీలించారు. ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. పట్టుచీరల తయారీ ఎంతో కళాత్మకంగా ఉందని ప్రశంసించారు. కేంద్రప్రభుత్వ ప్రతినిధి హరిప్రీత్‌సింగ్ వెంట జిల్లా చేనేత, జౌళి శాఖ ఏడీ హరికృష్ణ, చేనేత అభివృద్ధి అధికారి నరసింహారెడ్డి తదితరులు ఉన్నారు.

# అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్

● 10.77 లక్షల నగదు, 3 కేజీల గంజాయి, 2 సెల్ ఫోన్లు స్వాధీనం




నిందితులను చూపుతున్న ఎస్పీ రఘువీర్ రెడ్డి

**బొమ్మలసత్రం:** బస్సులో ప్రయాణికుల నుంచి డబ్బు చోరీ చేసి తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు అంతర్రాష్ట దొంగలను పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.10.77 లక్షల నగదు, 3 కేజీల గంజాయి, 2 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. దొంగల వివరాలను ఎస్పీ కార్యాలయంలో శనివారం అడిషన్ ఎస్పీ వెంకటరాముడితో కలిసి ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి విలేకరులకు వెల్లడించారు. కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలం ఎర్రబాడు గ్రామానికి చెందిన గొల్ల సంజన్న ఉల్లిగడ్డల వ్యాపారం చేస్తున్నాడు. ఈనెల 6న మూడు లారీల ఉల్లి గడ్డలను పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మార్కెట్‌లో విక్రయించాడు. రూ.11 లక్షలు రాగా బ్యాగులో వేసుకుని విజయవాడ నుంచి అనంతపురం వెళ్లే ఇంద్ర బస్సులో స్వగ్రామానికి బయలుదేరాడు. బస్సు గుంటూరుకు చేరుకోగానే యూపీ రాష్ట్రానికి చెందిన ఇక్రమ్, వసీమ్‌లు బస్సు ఎక్కి సంజన్న వెనుక సీట్లో కూర్చున్నారు. సంజన్న తన బ్యాగును పదే పదే గమనిస్తూ ఉండటంతో వెనక సీట్లో ఉన్న ఇద్దరూ గమనించి పెద్ద మొత్తంలో నగదు ఉందని నిర్ధారించుకున్నారు. సంజన్న నిద్రలోకి జారుకోగానే నగదు ఉన్న బ్యాగును తీసుకుని దోర్నాల వద్ద దిగి పారిపోయారు. కొంత సేపటికి సంజన్న నిద్ర లేచి చూడగా బ్యాగు కనిపించలేకపోవడంతో ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి పట్టణ శివారులో అనుమానస్పదంగా తిరుగుతున్న ఇక్రమ్, వసీమ్‌లను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా నేరం అంగీకరించారు. వారి నుంచి రూ.10,77,500 నగదు, 3 కేజీల గంజాయి, 2 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. కేసును త్వరగా ఛేదించిన ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ నాగభూషణ్, సీఐలు రామకృష్ణ, సాదిక్ అలి, ఎస్‌ఐ వెంకటప్రసాద్, హెచ్‌సీ బాలకృష్ణలను ఎస్పీ అభినందించారు.



## కోవెలకుంట్లలో చైన్‌స్నాచింగ్

**కోవెలకుంట్ల:** స్థానిక గుంజలపాడు రహదారిలో గుర్తు తెలియని వ్యక్తి ఓ మహిళ మెడలోని బంగారు గొలుసు లాక్కొని పారిపోయాడు. శనివారం ఎస్‌ఐ వెంకటరెడ్డి అందించిన సమాచారం మేరకు.. సుంకులమ్మ ఆలయ సమీపంలో నివాసం ఉంటున్న సుభాషిణి సొంత పనుల నిమిత్తం పట్టణంలోకి వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా ఇంటి సమీపంలో ఓ దుండగుడు మహిళ మెడలో గొలుసు లాక్కొని బైక్‌పై పరారయ్యాడు. మహిళ కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు వెంబడించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## 21న సీపీటీ పరీక్ష

**కర్నూలు(సెంట్రల్):** జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్ పోస్టుకు షార్ట్‌లిస్టులో ఎంపికైన 108 మందికి ఈనెల 21న కంప్యూటర్ బేస్డ్ సీపీటీ పరీక్ష నిర్వహించనున్నట్లు డీఆర్వో కె.మధుసూదనరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో 21వ తేదీ ఉదయం 10.30 గంటలకు టెస్టు ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. అభ్యర్థులు 9.45 గంటలకే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు.

## నేడు ఎస్సీ కమిషన్ చైర్మన్ రాక

**కర్నూలు (అర్బన్):** రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ ఆదివారం జిల్లాకు రానున్నారు. మధ్యాహ్నం 3:45 గంటలకు మండల కేంద్రమైన మద్దికెరకు చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారు. 16వ తేదీన ఉదయం 9 గంటలకు ఆయన కౌతాళం మండలం ఎరిగేరి గ్రామానికి చేరుకుని అక్కడినుంచి బైక్ ర్యాలీగా కామవరం గ్రామానికి చేరుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు అక్కడినుంచి బయలుదేరి విజయవాడ వెళ్తారు.